

నార్సింగి మండలం మంచిరేవులలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ చైర్మన్ సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సభ్యులు సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్, జోగు రామన్న, బాజిరెడ్డి గోవర్ధన్, అంజయ్యయాదవ్, రసమయి బాలకిషన్, ఎంసీ కోటిరెడ్డి, యాదవరెడ్డి

"బీఆర్‌ఎస్ అంటే భారత రాష్ట్ర సమితినే కాదు.. భారత రైతు సమితి కూడా. మా కృషి, సంకల్పం, పోరాటం.. రాష్ట్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్న 65% మంది బాగుండాలి. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. ఈ ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలతో రైతులు నిరాశ, నిస్పృహతో ఉన్నారు. ఇప్పటివరకు 400 మందికిపైగా ఆత్మహత్య చేసుకున్నరు. ఇవన్నీ ప్రభుత్వ హత్యలుగానే భావిస్తాం."

-కేటీఆర్

# రైతు ఆత్మహత్యలన్నీ సర్కారు హత్యలే

▶ మొదటిపేజీ తరువాయి...

నిరాశ, నిస్పృహతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఒక రైతు బ్యాంకులోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం.. రాష్ట్రంలో రైతుల దయనీయ పరిస్థితికి నిదర్శనమని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సంఘటన తాము అధ్యయన కమిటీ వేయడానికి పురిగొల్పిందని చెప్పారు. రంగారెడ్డి జిల్లా నార్సింగి మండలం మంచిరేవులలోని మాజీ మంత్రి, అధ్యయన కమిటీ చైర్మన్ సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నివాసంలో బుధవారం కమిటీ తొలి సమావేశమైన తరువాత కమిటీ సభ్యులతో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఆదేశం మేరకు ఏర్పాటైన ఈ కమిటీ శుక్రవారం నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి పని ప్రారంభిస్తుందని చెప్పారు. నెలరోజులపాటు అన్ని జిల్లాల్లో అన్ని వర్గాలను కలుస్తుందని, క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటుందని, వారిలో భరోసా నింపుతుందని వివరించారు. రాష్ట్రంలో 2023 డిసెంబర్ వరకు ఉన్న పరిస్థితులను, 13 నెలల కాలంలో నెలకొన్న పరిస్థితులను అంచనా వేస్తుందని వెల్లడించారు. తుది నివేదిక పార్టీ అధినేత కేసీఆర్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వానికి కూడా అందజేస్తామని, క్షేత్రస్థాయిలోని పరిస్థితులపై పలు సూచనలు చేస్తామని పేర్కొన్నారు. రైతు ఆత్మహత్యలపై వేసిన తమ కమిటీ వెనుక ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదని, ఇప్పట్లో ఎన్నికలు కూడా లేవని, రైతాంగానికి అండగా నిలబడాలనే ఆలోచన తప్ప ఇంకేమీ లేదని స్పష్టంచేశారు. ఈ ఏడాది కాలంలో ఏం జరిగింది? ఏం చేస్తే బాగుంటుంది? అని నిర్మాణాత్మకంగా ఆలోచన చేస్తున్నట్టు చెప్పారు.

## తిరోగమనం దిశగా సర్కారు: నిరంజన్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వ 13 నెలల పాలన తిరోగమనం దిశగా వెళ్తున్నదని, తెలంగాణ రైతాంగం సంక్షోభంలోకి నెట్టబడిందని రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ చైర్మన్ సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. కమిటీ తొలి సమావేశంలో రైతు ఆత్మహత్యలు, రైతుభరోసా, రుణమాఫీ పేరిట కాంగ్రెస్ చేసిన దగా, సాగునీటి కష్టాలు, రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించినట్టు తెలిపారు. ప్రభుత్వానికి ఇచ్చే సూచనలపై చర్చించామని, వ్యవసాయ కమిషన్‌కు కమిటీ నివేదిక ఇస్తుందని చెప్పారు. రైతుల సమస్యలపై చిత్తశుద్ధితో అధ్యయనం చేయాలని నిర్ణయించామని, నివేదిక తయారుచేసి జాతీయ స్థాయికి తీసుకువెళ్తామని వెల్లడించారు. సమావేశంలో కమిటీ సభ్యులు సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్, జోగు రామన్న, బాజిరెడ్డి గోవర్ధన్, అంజయ్యయాదవ్, రసమయి బాలకిషన్, యాదవరెడ్డి, కోటిరెడ్డి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

### రైతులపై ప్రేమ మచ్చుకైనా కనిపిస్తలేదు

రైతుల పట్ల కేసీఆర్‌కు ఉన్న ప్రేమ, ఆర్తి ప్రస్తుత పాలకుల్లో మచ్చుకైనా కనిపించడం లేదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదన్న పెద్దల మాటను వందకు వంద శాతం నమ్మి అందుకు తగ్గట్టుగానే 65% మంది ప్రజలు ప్రత్యక్షంగా ఆధారపడిన వ్యవసాయ రంగ సంక్షేమానికి కేసీఆర్ ఎన్నో కార్యక్రమాలను అమలుచేశారని గుర్తుచేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగ చేసిందని చెప్పారు. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత కరెంటు, భూమి శిస్తు రద్దు, నీటి తీరువా రద్దు, మిషన్ కాకతీయతో చెరువులను బాగుచేసిందని గుర్తుచేశారు. సాగునీటి పథకాలు కాళేశ్వరం, సీతారామ, పాలమూరు ప్రాజెక్టులను నిర్మించారని చెప్పారు. రైతు బంధు, రుణమాఫీ పేరుతో లక్ష కోట్లు నేరుగా 70 లక్షల రైతుల ఖాతాల్లో వేసిన ఏకైక ముఖ్యమంత్రి భారతదేశ చరిత్రలో కేసీఆర్ ఒక్కరేనని ప్రశంసించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతుల్లో ఆత్మవిశ్వాసం అపారంగా ఉండేదని తెలిపారు. స్వతంత్ర భారత చరిత్రలో ఎవరూ చేయని విప్లవాత్మక పనులను రైతుల కోసం కేసీఆర్ చేశారని చెప్పారు. రైతు ఆత్మహత్యలను గణనీయంగా తగ్గించిన రాష్ట్రంగా తెలంగాణను కేంద్ర ప్రభుత్వమే పార్లమెంటులో ప్రశంసించిందని గుర్తుచేశారు. రైతు డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నమ్మి అధికారం అప్పగిస్తే, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ సర్కారు దారుణంగా విఫలమైందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్‌కు రైతుల పట్ల ఉండే ఆవేదన, ఆర్తి ఈ రాష్ట్ర పాలకులకు లేదని దుయ్యబట్టారు.

"నిరంజన్‌రెడ్డి నేతృత్వంలో కమిటీ రాష్ట్రమంతటా విస్తృతంగా రాబోయే నెలరోజులపాటు పర్యటిస్తుంది. రైతు సంఘాలు, రైతులతో ఎక్కడికక్కడ కలుస్తారు. రుణమాఫీ ఎంత మేరకు జరిగింది? కరెంటు సరఫరా ఎలా ఉన్నది? సాగు పరిస్థితి ఎలా ఉన్నది? మద్దతు ధర దొరకుతున్నదా? బోనస్ ఏమైంది? కొనుగోలు కేంద్రాలు ఏమయ్యాయి? రైతు వేదికలు పనిచేస్తున్నాయా? వంటి అంశాలను కమిటీ సభ్యులు అధ్యయనం చేస్తారు. రైతుల్లో భరోసా నింపేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తారు. ఒక మంచి ఆలోచనతో, రైతాంగానికి అండగా నిలబడే ఉద్దేశం మాది."

-కేటీఆర్

### ప్రజలంతా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు..

రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచి మొదలైన గ్రామసభల్లో ప్రజలంతా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని కేటీఆర్ చెప్పారు. గ్రామసభల్లో ప్రజలు మర్లబడుతున్నరని, టెంట్లు కూలగొడుతున్నరని, రేపు ఇదే తీరుగా కొనసాగితే ఏదో దశలో ప్రజలు ప్రభుత్వాన్ని తిరస్కరిస్తరని హెచ్చరించారు. రాష్ట్రమంతా వెల్లువెత్తుతున్న ఆందోళల్లో ఎక్కడా తమ పార్టీ నేతలు లేరని, ప్రజలే స్వచ్ఛందంగా నిలదీస్తున్నారని తెలిపారు. రుణమాఫీ, రైతుబంధు గురించి గ్రామసభల్లో ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం దగ్గర సమాధానం లేదని ఎద్దేవా చేశారు. నేతలు ఇచ్చిన హామీలకు అధికారులు బలవుతున్నారని, సీఎం విదేశాల్లో, మంత్రులు రాహుల్ టూర్‌లో తరిస్తున్నారని మండిపడ్డారు. 'అధికారంలోకి రాగానే ప్రజాపాలన పేరిట కోటీ ఆరు లక్షల దరఖాస్తులు తీసుకున్నారు. మళ్లీ ఇప్పుడు ఎందుకు తీసుకుంటున్నరు?' అని ప్రజలు ప్రశ్నిస్తున్నారని వివరించారు. ఎవరి తప్పు ఇది? ఆ దరఖాస్తులు ఎక్కడ? ఉన్నాయని నిలదీశారు. ప్రభుత్వం పరిపాలనలో నిమగ్నం కావాలని, ఇతర కార్యక్రమాలు బంద్ చేయాలని హితవు పలికారు. ఒకే అబద్ధాన్ని వందసార్లు చెప్తే నిజమవుతుందన్న అపోహలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని దుయ్యబట్టారు. తమ హయాంలో 6.47 లక్షల పైచిలుకు రేషన్‌కార్డులను మీ-సేవ కేంద్రాల ద్వారా ఇచ్చామని చెప్పారు. హోంశాఖ మంత్రి లేకపోవడంతో రాష్ట్రంలో శాంతిభద్రతలు పడకేశాయని కేటీఆర్ విమర్శించారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా ప్రతిపక్షాల మీద అక్రమ కేసులు బనాయించడం, సోషల్‌మీడియా పోస్టులకు భయపడి అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి ప్రాధాన్యం ఫార్ములా కేసైతే, తమ ప్రాధాన్యం ఫార్మర్ అని చెప్పారు.

### 28న నల్లగొండలో రైతు మహాధర్నా

సీఎం రేవంత్‌రెడ్డి రాజ్‌భవన్ వద్ద కాంగ్రెస్ నేతలతో పెద్ద ఎత్తున ధర్నా చేయవచ్చు.. కానీ, తాము మాత్రం నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్ వద్ద రైతు సమస్యలపై ధర్నా చేయవద్దా? అని కేటీఆర్ నిలదీశారు. కాంగ్రెస్‌వారు చేస్తే ట్రాఫిక్ స్తంభించదు.. బీఆర్‌ఎస్ చేస్తే ట్రాఫిక్ స్తంభిస్తదా? అని ప్రశ్నించారు. నల్లగొండలో బీఆర్‌ఎస్ రైతు మహాధర్నాకు హైకోర్టు అనుమతి ఇచ్చిందని, ఈ నెల 28న 11 గంటల నుంచి 2 గంటల వరకు నిర్వహించుకునేందుకు అనుమతి ఇచ్చిందని చెప్పారు. రాష్ట్రంలో ప్రజాపాలన నడుస్తున్నదని, నిరసన తెలుపవచ్చని ప్రకటించిన అని సీఎం రేవంత్‌రెడ్డి.. చిన్న ధర్నాకే ఆగమాగం అయిపోయి.. చివరికి అనుమతి నిరాకరించారని ఎద్దేవా చేశారు. చివరకు హైకోర్టు న్యాయం చేసిందని, రైతు మహాధర్నాకు అనుమతి ఇచ్చినందుకు హైకోర్టుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని చెప్పారు. కోర్టు ఆదేశాల మేరకు నడుచుకుని రైతుల ఆవేదన, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని స్పష్టంచేశారు.



నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం సల్కునూరు పీఏసీఎస్ వద్ద బుధవారం యూరియా కోసం బారులుదీరిన రైతులు

# యూరియా వెతలు

**దుకాణాల్లో అధిక ధరలకు విక్రయాలు • కృత్రిమ కొరతతో ఇబ్బందుల్లో రైతులు**

మిర్యాలగూడ, జనవరి 22 : ఆరుగాలం కష్టించి వరి సేద్యం చేస్తున్న అన్నదాతలకు యూరియా వెతలు తీవ్ర ఆవేదన కలిగిస్తున్నాయి. పొలానికి వేయాల్సిన సమయంలో యూరియా వేయకపోవడంతో దిగుబడిపై ప్రభావం పడుతుందని ఆందోళన చెందుతున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో గత ప్రభుత్వంలో ఎన్నడూ యూరియా కొరత రాలేదు. ఉమ్మడి జిల్లా నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో ఈ యాసంగిలో దాదాపుగా 3.35 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. యూరియా వేసేందుకు రైతులు దుకాణాల చుట్టూ తిరిగినా యూరియా దొరకక రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. వ్యాపారులు అధిక ధరలకు విక్రయించాలన్న ఉద్దేశంతో యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని, రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సరిపడా యూరియా అందించడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆరోపిస్తున్నారు.

## ఎరువుల కొరత లేకుండా చూడాలి

**అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం**

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): ఎరువుల కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు సమన్వయంతో పని చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఎరువులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎరువుల పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. యూరియా తదితర ఎరువులను ముందుగానే ప్యాక్స్, ఏఆర్‌ఎస్కేలకు సరఫరా చేసి అందుబాటులో ఉంచాలని సూచించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి మాట్లాడుతూ.. అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, కొరత లేకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

**లక్ష టన్నుల గోదాములు..**

రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్‌పై చైర్మన్ రాయల నాగేశ్వర్‌రావుతో కలిసి మంత్రి తుమ్మల సమీక్షించారు. అధునాతన టెక్నాలజీ వినియోగించి గోదాములను నిర్మించాలని ఆదేశించారు. స్థలం కొరతను దృష్టిలో ఉంచుకొని సైలోస్ విధానంలో గోదాముల నిర్మాణం చేపట్టాలని సూచించారు.

## విద్యుత్తు షాక్‌తో రైతు మృతి

బీబీపేట్ (దోమకొండ), జనవరి 22: కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం సంగమేశ్వర్‌లో విద్యుత్తుషాక్‌తో ఓ రైతు మృతి చెందినట్టు ఎస్సై ఆంజనేయులు బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సంగమేశ్వర్ గ్రామానికి చెందిన మొగుల్ల సిద్దయ్య(59) అడవిపందుల బెడద నుంచి పంటను కాపాడుకోవడానికి ప్రతి రోజు మక్కజొన్న చుట్టూ విద్యుత్తుతీగలు అమర్చి మరుసటి రోజు తెల్లవారుజామున తొలగించేవాడు. బుధవారం ఉదయం 6 గంటల సమయంలో మక్కజొన్న పంట చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్తుతీగను తొలగించే క్రమంలో ప్రమాదవశాత్తు షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య బీరవ్వ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

# తెలంగాణ, ఏపీ హైకోర్టులకు ఆరుగురు కొత్త జడ్జీలు

**నియామకాలకు రాష్ట్రపతి ఆమోదం ● కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్**



మధుసూదన్‌రావు | తిరుమలాదేవి | నర్సింగ్ రావు | రేణుక యారా

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణ, ఏపీ హైకోర్టులకు కొత్తగా ఆరుగురు న్యాయమూర్తులు నియమితులయ్యారు. వీరిలో నలుగురిని తెలంగాణ హైకోర్టులో, ఇద్దరిని ఏపీ హైకోర్టులో నియమించారు. వీరంతా జ్యుడీషియల్ సర్వీస్‌లో ఉన్న న్యాయాధికారులే. వీరిని హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం ఈ నెల 11న కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. తదనుగుణంగా కేంద్రం పంపిన నివేదికకు రాష్ట్రపతి బుధవారం ఆమోదముద్ర వేశారు. దీంతో కేంద్ర న్యాయశాఖ రెండు గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులుగా జిల్లా జడ్జీల కోటాలో హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి రేణుక యారా, సిటీ సివిల్ స్మాల్‌కాజెస్ కోర్టు చీఫ్ జడ్జి నందికొండ నర్సింగ్‌రావు, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఎడ తిరుమలాదేవి, హైకోర్టు పరిపాలన విభాగం రిజిస్ట్రార్ బొబ్బిలి రామయ్య మధుసూదన్‌రావు నియమితులయ్యారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తులుగా ఆ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ అవధానం హరిహరనాథశర్మ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ డాక్టర్ యడవల్లి లక్ష్మణరావును నియమించారు. వీరంతా ఈ వారంలోనే ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉన్నది. తెలంగాణ హైకోర్టుకు నియమితులైన నలుగురు న్యాయమూర్తులు ఈ నెల 25న మొదటి కోర్టు హాల్‌లో ప్రమాణస్వీకారం చేయనున్నారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తితో కలిపి 26 మంది జడ్జీలు ఉన్నారు. కొత్తవారు ప్రమాణ స్వీకారం చేస్తే ఆ సంఖ్య 30కి పెరుగనున్నది.

### నందికొండ నర్సింగ్ రావు

హైదరాబాద్ చెందిన నందికొండ పెంటయ్య, మణెమ్మ దంపతులకు 1969 మే 3న జన్మించిన నర్సింగ్‌రావు హైదరాబాద్‌లో పాఠశాల, కళాశాల విద్యాభ్యాసాన్ని పూర్తిచేశారు. 1995లో సీఎంఆర్ కాలేజీలో లా పూర్తిచేసి, అదే ఏడాది న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. 2012లో నేరుగా జిల్లా జడ్జిగా ఎంపికై విశాఖపట్నం అదనపు జిల్లా జడ్జిగా బాధ్యతలు చేపట్టారు. జ్యుడిషియల్ అకాడమీలో గుంటూరు, వరంగల్, ఎల్బీనగర్, సైబరాబాద్ ఎంఎస్‌ఐగా, న్యాయశాఖ కార్యదర్శిగా పనిచేశారు. అనంతరం హైకోర్టు జ్యుడీషియల్ ఇన్‌ఫ్రా రిజిస్ట్రార్‌గా, ప్రస్తుతం సిటీ స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

### తిరుమలాదేవి

సంగారెడ్డికి చెందిన ఎడ తిరుమలాదేవి 1964 జూన్ 2న జన్మించారు. హైదరాబాద్‌లోనే చదివారు. లా పూర్తిచేశాక హైకోర్టుతోపాటు జిల్లా కోర్టుల్లో ప్రాక్టీస్ చేశారు. 2012లో జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. నిజామాబాద్, ఖమ్మం, వరంగల్‌లో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జిగా పనిచేశారు. అనంతరం హైకోర్టు రిజిస్ట్రార్‌గా, తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా పనిచేసిన ఆమె.. ప్రస్తుతం హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

### మధుసూదన్‌రావు

ఉమ్మడి వరంగల్ జిల్లా ఖాజీపేటలో ఎల్లయ్య, అనసూయ దంపతులకు 1969 మే 25న జన్మించిన మధుసూదన్‌రావు.. రైల్వే హైస్కూల్‌లో పాఠశాల విద్య, కాకతీయ యూనివర్శిటీలో ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం పూర్తిచేసి, 1999లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. 2012 డిసెంబర్‌లో జిల్లా జడ్జిగా ఎంపికై నెల్లూరు, చిత్తూరు, మేడ్చల్ మల్కాజిగిరి కోర్టుల్లో పనిచేయడంతోపాటు సీబీఐ కోర్టు ప్రధాన జడ్జిగా, వ్యాట్ జ్యుడీషియల్ సభ్యునిగా, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శిగా సేవలందించారు. ప్రస్తుతం హైకోర్టు పరిపాలనా విభాగం రిజిస్ట్రార్‌గా పని చేస్తున్నారు.

### రేణుక యారా

హైదరాబాద్‌లో ఐలయ్య, నాగమణి దంపతులకు 1973 జూన్ 14న జన్మించిన రేణుక యారా.. హైదరాబాద్‌లోనే పాఠశాల విద్య అభ్యసించారు. 1998లో బషీర్‌బాగ్‌లోని పీజీ లా కాలేజీలో ఎల్‌ఎల్‌బీ పూర్తిచేశాక ఫిలడెల్ఫియా విశ్వవిద్యాలయంలో ఎల్‌ఎల్‌ఎం చేశారు. 1998లో రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకుని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో ప్రాక్టీస్ మొదలుపెట్టారు. 2012 డిసెంబర్‌లో జిల్లా జడ్జిగా ఎంపికై వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి జిల్లాల్లో పనిచేయడంతోపాటు వ్యాట్ ట్రిబ్యునల్ జ్యుడీషియల్ సభ్యురాలిగా పనిచేశారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శిగా, సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జిగా సేవలందించారు.

### అవధానం హరిహరనాథ శర్మ

అవధానం రామచంద్రయ్య, సుబ్బమ్మ దంపతులకు 1968 ఏప్రిల్ 16న జన్మించిన హరిహరనాథశర్మ స్వస్థలం కర్నూలు. కర్నూలులోని ఉస్మానియా కళాశాలలో బీఎస్సీ, నెల్లూరులోని వీఆర్ న్యాయ కళాశాలలో లా పూర్తిచేసిన శర్మ.. 994లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యాక కర్నూలు జిల్లా కోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. తొలుత సీనియర్ న్యాయవాది రామకృష్ణారావు వద్ద జూనియర్‌గా పనిచేశాక 1998లో సొంతగా ప్రాక్టీసు మొదలుపెట్టారు. 2007 అక్టోబర్‌లో జిల్లా జడ్జిగా ఎంపికై ఉమ్మడి ఏపీలోని పలు జిల్లాల్లో పనిచేశారు. 2017-18లో అనంతపురం, 2020-22లో విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి (పీడీజే)గా సేవలందించి 2022లో హైకోర్టు రిజిస్ట్రార్‌గా చేశారు. 2023 నుంచి ఏపీ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

### యడవల్లి లక్ష్మణరావు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కనిగిరికి చెందిన డాక్టర్ యడవల్లి లక్ష్మణరావు 1975 ఆగస్టు 3న వెంకటేశ్వర్లు, పద్మావతి దంపతులకు జన్మించారు. ఆయన ప్రాథమిక విద్య ప్రకాశం జిల్లాలో కొనసాగింది. నెల్లూరు వీఆర్ న్యాయ కళాశాలలో లా చేశారు. 2000 సంవత్సరంలో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యాక నాటి ఉమ్మడి ప్రకాశం జిల్లాతోపాటు నెల్లూరు, కావలిలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. జిల్లా జడ్జి పోస్టులకు నిర్వహించిన పరీక్షలో ఫస్ట్ ర్యాంక్ సాధించి 2014లో జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. ఏలూరులో అదనపు జిల్లా జడ్జిగా సేవలందించారు. ఉమ్మడి ఏపీలోని పలు ప్రాంతాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. 2021లో హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)గా నియమితులైన ఆయన.. ఆ తర్వాత నుంచి రిజిస్ట్రార్ జనరల్‌గా కొనసాగుతున్నారు.



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, బీఆర్‌ఎస్ నాయకులు ఆర్‌ఎస్పీ, పొన్నాల లక్ష్మయ్య, గట్టు రామచందర్‌రావు, కూసంపూడి మహేశ్, ఉమామహేశ్వరరావు

# సర్కార్‌పై సామాన్యుడి పోరాటం

- **ప్రజాగ్రహానికి గ్రామసభలే సాక్ష్యాలు**
- **కేసీఆర్ హయాంలోనే పల్లెలు, పట్టణాల అభివృద్ధి**
- **సత్తుపల్లి నేతలతో సమావేశంలో కేటీఆర్**

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉన్నదో ప్రస్తుతం జరుగుతున్న గ్రామసభల్లో వెల్లువెత్తుతున్న నిరసనలు, ఆందోళనలే స్పష్టం చేస్తున్నాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. తెలంగాణ భవన్‌లో బుధవారం బీఆర్‌ఎస్ సత్తుపల్లి మున్సిపాలిటీ నేతలతో సమావేశమయ్యారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పాలకవర్గం గడువు కొద్దిరోజుల్లో ముగుస్తుండటంతో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలపై గ్రామసభల్లో ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడుతున్నారని, ఆగ్రహంతో సభ టెంట్లను ఎక్కడికక్కడ పీకేయడం, అధికారులను అడ్డుకోవడం చూస్తుంటే ప్రజలు ఎంత ఇబ్బందులకు గురవుతున్నారో తెలుస్తున్నదని వాపోయారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను తీవ్ర ఇబ్బందులు పెట్టిందని విమర్శించారు.

**ఉమ్మడి ఖమ్మంలో మళ్లీ బీఆర్‌ఎస్ విజయకేతనం**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ మళ్లీ విజయకేతనం ఎగురవేస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తంచేశారు. కేసీఆర్ ప్రోత్సాహంతో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఖమ్మం జిల్లాను ప్రగతి పథంలో నడిపించారని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యతో పాటు 17 మంది సత్తుపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్లను కేటీఆర్ సన్మానించారు. సత్తుపల్లి మున్సిపాలిటీలో 23 మంది కౌన్సిలర్లు బీఆర్‌ఎస్ పార్టీ తరఫున గెలుపొందితే ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా 17 మంది పార్టీలోనే కొనసాగడం హర్షణీయమని కొనియాడారు. ఎవరు ఎన్ని ఇబ్బందులు పెట్టినా పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడకుండా ప్రభుత్వంపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సత్తుపల్లి నియోజకవర్గ నేతలతో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ త్వరలోనే సమావేశమవుతారని హామీ ఇచ్చారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలతో పల్లెలు, పట్టణాల్లో అభివృద్ధిని పరుగులు పెట్టించామని, గత ప్రభుత్వాలకంటే వంద రెట్లు ఎక్కువ పురోగతి సాధించామని వెల్లడించారు. గ్రామాలు, పట్టణాలు, మున్సిపాలిటీలకు అధిక నిధులు కేటాయించి అన్ని సౌకర్యాలు కల్పించామని గుర్తు చేశారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో అంతా తారుమారైందని విమర్శించారు. ఇప్పటి దాకా పల్లెలు, పట్టణాలు, మున్సిపాలిటీల కోసం ఏ ఒక్క పథకాన్నీ కాంగ్రెస్ అమలు చేయలేదని చెప్పారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, సత్తుపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ కూసంపూడి మహేశ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ రేషన్‌కార్డులు అందిస్తాం

**మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి**

హైదరాబాద్, జనవరి22 (నమస్తే తెలంగాణ): అర్హులందరికీ రేషన్‌కార్డులను అందిస్తామని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో మంత్రి జూమ్ సమావేశాన్ని నిర్వహించారు. గ్రామ సభలు, రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 26న కొత్త కార్డుల పంపిణీ ప్రారంభమవుతుందని, అర్హులందరికీ కార్డులు అందేవరకు ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. సమావేశంలో పలువురు ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సచివాలయంలో ఆంక్షల అడ్డంకులు

- **ఒక్క పాస్‌పై ఒక్కరినే అనుమతిస్తున్న సిబ్బంది**
- **కార్లల్లో కుప్పలుగా వెళ్లినా పట్టించుకోని అధికారులు**

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): సచివాలయానికి వస్తున్న సందర్శకులపై భద్రతా సిబ్బంది రోజుకో కొత్తరకం ఆంక్షలు విధిస్తున్నారు. మధ్యాహ్నం 3-5 గంటల మధ్య సందర్శన వేళల్లో లోపలికి వెళ్లాలంటే చెకింగ్‌ల పేరుతో అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని సందర్శకులు వాపోతున్నారు. సచివాలయంలోనికి వెళ్లేందుకు మీడియాపాయింట్‌లోని కౌంటర్‌లో పాస్‌లు జారీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఎవరైనా బృందంగా వెళ్లాలనుకుంటే వారిలో ఒక్కరి వివరాలు సమర్పించి, మిగతా వారి అంకె వేసి పాస్ ఇచ్చేవారు. కానీ బుధవారం నుంచి ఒక్క పాస్ ఒక్కరికి మాత్రమే జారీ చేస్తున్నారు. అంటే.. సచివాలయంలోకి వెళ్లాలనుకునే ప్రతి ఒక్కరూ పాస్ తీసుకోవాల్సి ఉంటుంది. ఆధార్ కార్డు చూసి, వివరాలన్నీ నమోదు చేసుకొని, ఫొటో తీసుకున్న తర్వాతే పాస్ మంజూరు చేస్తున్నారు. అయినా.. సచివాలయంలోకి వెళ్లే ప్రధాన గేటు దగ్గర మరోసారి ఆధార్ కార్డు చూపించాలని సిబ్బంది పట్టుబడుతున్నారు. దీంతో ఎన్నిసార్లు ఆధార్ చూపించాలంటూ సందర్శకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పైగా.. సచివాలయ ప్రధాన గేటుకు పది అడుగుల ముందు కొత్తగా ఒక బారికేడ్‌ను ఏర్పాటు చేశారు. ముందుగా అక్కడ పాస్, ఆధార్ కార్డు పరిశీలించి పంపిస్తున్నారు. పది అడుగులు వేయగానే ప్రధాన గేటు వద్ద మరోసారి పాస్‌ను పరిశీలిస్తున్నారు. లోపల సచివాలయ భవనంలోకి వెళ్లే ప్రధాన ద్వారం వద్ద మరోసారి స్కానర్లతో చెక్ చేస్తున్నారు. ఇలా ఐదు దశలను దాటితే తప్ప సచివాలయ భవనంలోకి వెళ్లలేకపోతున్నామని సందర్శకులు వాపోతున్నారు. గతంలో ఇన్ని ఆంక్షలు లేవన్నారు. కొందరు మంత్రులు, అధికారుల పేషీల నుంచి ప్రత్యేక అనుమతితో లోనికి వెళ్తుంటారు. గతంలో వారిని నేరుగా లోపలికి పంపేవారు. కానీ ఇప్పుడు వారిని కూడా ఆధార్ చూపించిన తర్వాతే లోనికి పంపుతున్నారు. సచివాలయంలోకి కార్లల్లో వెళ్లేవారికి మాత్రం ఆంక్షలు లేకపోవడంపై సందర్శకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**లోపలా.. ఆంక్షలే**

సందర్శకులకు సచివాలయంలోనూ ఆంక్షలు కొనసాగుతున్నాయి. సీఎం పేషీతోపాటు, సీఎంవో అధికారుల కార్యాలయాలు ఉండే ఆరో అంతస్థును ఒక నిషిద్ధ ప్రదేశంగా మార్చేశారు. ప్రత్యేక అనుమతి ఉన్నవారిని మాత్రమే ఆరో అంతస్తులోకి అనుమతిస్తున్నారు. వీఐపీలు వెళ్లే లిఫ్టులు తప్ప మిగతా అన్నింటినీ ఐదో అంతస్తు వరకు మాత్రమే పరిమితం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ఇన్ని ఆంక్షలు లేవని సందర్శకులు చెప్తున్నారు.